ఈనాడు
వరంగల్
గురువారం సెప్టెంబరు 26, 2024

నేటి నుంచి వయోవృద్ధుల వారోత్సవాలు


గోడపత్రిక ఆవిష్కరిస్తున్న జిల్లా పాలనాధికారి డా.సత్యశారద, ఇతర అధికారులు

వరంగల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: అక్టోబరు ఒకటో తేదీన ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా ఈ నెల 26 నుంచి వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పాలనాధికారి డా.సత్యశారద పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో వారోత్సవాలకు సంబంధించిన గోడపత్రికలను ఆమె ఆవిష్కరించారు. 26న వృద్ధాశ్రమాల్లో క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, 27న వాకతాన్ ర్యాలీ, 28న అధికారులకు వయోవృద్ధుల చట్టం-2007పై అవగాహన, 29న పంచాయతీ కార్యదర్శులకు అవగాహన, 30న అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో వయోవృద్ధుల దినోత్సవం నిర్వహణ, అక్టోబరు ఒకటో తేదీన జిల్లాస్థాయి కార్యక్రమంతో వారోత్సవాలు ముగుస్తాయన్నారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీసీపీ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఒప్పంద ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: కాకతీయ వైద్య కళాశాలలో వివిధ విభాగాల్లో ఒప్పంద(కాంట్రాక్టు) పద్ధతిలో 68 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 4 సీఏఎస్ ఆర్ఎంఓ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేఎంసీ ప్రిన్సిపల్ డా.రాంకుమార్‌రెడ్డి తెలిపారు. అర్హులు సంబంధిత ధ్రువపత్రాలతో ఈ నెల 27 నుంచి అక్టోబర్ 3వ తేదీలోపు ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు కేఎంసీ ప్రిన్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. దరఖాస్తు ఫారం ఇతర వివరాలకు కళాశాల వెబ్‌సైట్ https:///www.kmcwgl.com చూడాలన్నారు.

వర్షాల వేళ.. ఒడిసిపడదాం!




ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రభుత్వ ఉత్తర్వులు

పౌరుల మేలుకొలుపు కోసం..!

నగర పాలక సంస్థతో పాటు పురపాలికల్లో పౌరుల మేలుకొలుపు కోసమన్నట్లు ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టారు. జల శక్తి అభియాన్ పథకం కింద 'క్యాచ్ ది రెయిన్' పిలుపుతో ఈ కార్యాచరణ అమలు చేశారు. డోర్నకల్ మున్సిపల్ పాలకవర్గం, ఉద్యోగులు ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు.

బాధలన్నీ గట్టెక్కాయి..

ఈ దంపతుల పేర్లు ధారావత్-రామిని.. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం చాప్లాతండా వాసులు. వీరింట్లో బోరు నుంచి అంతంతమాత్రంగానే నీరు వచ్చేది. ఇంకుడు గుంత నిర్మాణం చేపట్టాక ఇంటి అవసరాలకు సరిపడా నీరొస్తోంది. ఇంట్లో వాడిన నీళ్లు నేరుగా ఇంకుడు గుంతలోకి వెళ్తుండటంతో దోమలు, విష పురుగుల బాధ తప్పింది.

దాహం వేసినప్పుడే ఆలోచిద్దామా..?

ఇప్పుడు వర్షాలు పడుతున్నాయి.. నీరంతా వృథాగా సముద్రం పాలవుతోంది.. కాంక్రీట్ వనంలో చుక్క నీరు కూడా ఇంకడం లేదు.. మళ్లీ వేసవి వచ్చేవరకు తాగునీటికి కటకటే.. అప్పుడు ఇంకుడు గుంతలు గుర్తుకొస్తాయి.. దాహం వేసినప్పుడే.. బావి తవ్వితే ప్రయోజనం ఉంటుందా..? మరేం చేద్దాం..!

ఇదే తరుణం...

తాజాగా వాన నీటిని ఒడిసిపట్టేందుకు.. భూగర్భ జలాల పెంపునకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ నడుం బిగించింది. అన్ని పురపాలికలు, నగరపాలక సంస్థల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, 300 చదరపు మీటర్లకు మించిన అన్ని నిర్మాణాల్లో ఇంకుడు గుంత ఉండాలని ఉత్తర్వులు వెలువరించింది. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగంతో పాటు ఇటు పౌరులు కదలాలి.

న్యూస్‌టుడే- కార్పొరేషన్, డోర్నకల్, జనగామ

భవనాల నిర్మాణాలకు అనుమతిచ్చేటప్పుడే ఇంకుడుగుంత ఉండేలా తప్పని చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఆ మేరకు విధివిధానాలను పొందుపర్చింది. ఇప్పటికే ఉన్న భవనాల్లోనూ నిర్మించాలి. విద్యా సంస్థలు, ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు, అపార్ట్‌మెంట్లు, ప్రైవేట్ వాణిజ్య భవనాల్లోనూ తప్పనిసరి. బడా భవనాలకు ఆక్యుపెన్సీ కమ్ కంప్లీషన్ సర్టిఫికెటు ఇచ్చే ముందు ఇంకుడుగుంత నిర్మించారో లేదో అధికారులు పరిశీలించాలి.

డిపాజిట్ వెనక్కి తీసుకున్నవారే లేరు..

భవన నిర్మాణ అనుమతి రుసుములో ఇంకుడు గుంతల డిపాజిట్ చెల్లించి, నిర్మాణం పూర్తయిన పిదప, ఇంకుడు గుంతల డిపాజిట్ రుసుమును వెనక్కి తీసుకోవచ్చు. కానీ, పురపాలికల్లో ఇంకుడు గుంతలు నిర్మించి, రుసుము వెనక్కి తీసుకున్న దాఖలాలు తక్కువే..

మూలుగుతున్న రూ.5 కోట్లు

ఇంకుడు గుంతల నిర్మాణం కోసం గ్రేటర్ వరంగల్ డబ్బులు వసూలు చేసింది. బిల్డింగ్ పర్మిషన్ ఫీజుతో పాటు వాటర్ హార్వెస్టింగ్ ఛార్జీలు తీసుకున్నారు. నివాస గృహాల నుంచి రూ.5 వేలు, అపార్ట్‌మెంట్లు, వ్యాపార, వాణిజ్య భవనాల నుంచి రూ.10వేల పైనే వసూలు చేశారు. 2003 నుంచి నిధులను ప్రత్యేక ఖాతాలో జమ చేశారు. ఇలా రూ.5 కోట్ల నిధులు మూలుగుతున్నాయి. 2013, 2018లో స్పెషల్ డ్రైవ్ ద్వారా కొంతమంది యజమానులు ఇంకుడు గుంతలు నిర్మించినా అసంపూర్తిగా వదిలేశారు.

కానరాని చైతన్యం

పట్టణ ప్రజల్లో చైతన్యం కానరావడం లేదు. భవన నిర్మాణం జరిగిన చోటల్లా ఇంటి ఆవరణ లేదా పరిసరాల్లో ఇంకుడు గుంత నిర్మాణమనేది నామ మాత్రంగా కనిపిస్తోంది. ఉమ్మడి జిల్లాలోని పట్టణాల్లో మూడు నెలల క్రితం అధికారులు ఇంటింటా సర్వే చేశారు. గ్రేటర్ వరంగల్ పరిధిలో 900 చదరపు మీటర్లు దాటిన గృహాలు 11,588 ఉన్నాయి. ఇందులో 6,973 ఇళ్లు సర్వే చేయగా.. కేవలం 789 ఇళ్లలో ఇంకుడు గుంతలు నిర్మించారు. 768 వాడకంలో ఉండగా, 21 నిరుపయోగంగా ఉన్నాయి. 6184 ఇళ్లలో లేవని తేలింది.

ఇలా నిర్మిద్దాం

ఇంట్లో వాలు స్థలం ఎంపిక చేసుకోవాలి. అనువైన పొడవు, వెడల్పుతో 2 మీటర్ల లోతు గుంత తవ్వాలి. అడుగు భాగాన సగభాగం 40 మి.మీ కంకర, తర్వాత పావు భాగం 20 మి.మీ కంకర నింపాలి. గుంత కొంత భాగం ఖాళీగా ఉండేలా చూసుకొని దొడ్డు ఇసుకతో నింపాలి. తర్వాత వర్షపు నీటి వైపును ఇంకుడు గుంతలోకి మళ్లించాలి. ఇళ్లలో ఖాళీగా ఉన్న బోర్లను కూడా ఇంకుడు గుంతలా చేసి నీటిని మళ్లించవచ్చు.



ఉమ్మడి జిల్లాలో పరిస్థితి ఇదీ

పట్టణాల్లో ఆవాసాలు	3,51,768
అపార్టుమెంట్లు	687
ఇంకుడు గుంతలు	2146

మాయదారి వాన.. అన్నదాత హైరానా!


నర్సంపేట మార్కెట్‌లో వర్షానికి తడిసిన మొక్కజొన్నలను దగ్గర చేస్తున్న రైతులు


టార్పాలిన్లపై నిలిచిన నీరు


తడిసిన మక్కలు చూపుతున్న రైతు లాల్‌సింగ్

నర్సంపేట, న్యూస్‌టుడే: జిల్లాలో బుధవారం మధ్యాహ్నం ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. అప్పటి వరకు ఎండగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా మారడంతో అన్నదాతలు ఆగమాగమయ్యారు. నర్సంపేట వ్యవసాయ మార్కెట్‌లో ఆరబోసిన మొక్కజొన్నలు తడిసిపోయాయి. దిగుబడులను కాపాడుకోవడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. టార్పాలిన్లు కప్పేలోపు మక్కల రాశులు తడిసిపోయాయి. కొన్ని వరదకు కొట్టుకుపోయాయి. నేడో, రేపో తూకం వేయాల్సిన మక్కలు మాయదారి వానకు తడిసిపోవడంతో 'చేతికాడికి వచ్చిన ముద్ద చేజారినట్లు' అయ్యిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు. నర్సంపేట మండలం పర్శునాయక్‌తండాకు చెందిన లాల్‌సింగ్ అనే రైతు మూడురోజుల క్రితం మక్కలు తెచ్చి ఆరబోయగా.. తూకం వేస్తారనుకునే సమయంలో వర్షం పడటంతో మక్కలన్నీ తడిసిపోయాయని వాపోయారు. బుచ్చనాయక్‌తండాకు చెందిన రైతు నాలుగు ఎకరాల్లో పండించిన పంటను అయిదు రోజుల క్రితం మార్కెట్‌కు తీసుకువచ్చారు. 16 శాతం తేమ వస్తే సోమవారం తూకం వేయకుండా నిరాకరించారని.. అప్పుడే కొనుగోలు చేస్తే.. తడిసేవికావని కన్నీటిపర్యంతమయ్యారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు మరవలేనివి


పారిశుద్ధ్య కార్మికుడి కాళ్లు కడుగుతున్న డీఆర్డీఓ కౌసల్యాదేవి, జడ్పీ సీఈవో రాంరెడ్డి

నెక్కొండ, న్యూస్‌టుడే: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న సేవలు మరవలేనివని డీఆర్డీఓ కౌసల్యాదేవి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమంలో పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు. జడ్పీ సీఈవో రాంరెడ్డి మాట్లాడుతూ.. గ్రామ పరిశుభ్రతలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. గ్రామ సామాజిక చిత్రపటాన్ని చిత్రీకరించి చెత్త పేరుకుపోవడంతో ఏర్పడే దుష్పరిణామాలను గ్రామస్థులు, విద్యార్థులకు వివరించారు. అనంతరం పాఠశాలలో మొక్కలు నాటారు. నిత్యం గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి గ్రామాన్ని శుభ్రంగా తీర్చిదిద్దుతున్న పారిశుద్ధ్య కార్మికులు శ్రీనివాస్, ప్రమీల కాళ్లను జడ్పీ సీఈవో రాంరెడ్డి, డీఆర్డీఓ కౌసల్యాదేవి కడిగి, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి అనురాధ, ఇన్‌ఛార్జి ఎంపీడీవో దయాకర్, ఎంఈవో రత్నమాల, మహిళ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ దుస్తుల్లో మెరిసిన విద్యార్థులు



కాకతీయ వైద్య కళాశాల వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ఉత్కర్ష-24 కార్యక్రమంలో భాగంగా బుధవారం వైద్య విద్యార్థులు నిర్వహించిన సంప్రదాయ దుస్తుల ప్రదర్శన ఆకట్టుకుంది. ముఖ్య అతిథులుగా హాజరైన కాళోజీ ఆరోగ్యవిశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ సంధ్య, కేఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ రాంకుమార్‌రెడ్డి ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. సాయంత్రం నిర్వహించిన దాండియా కార్యక్రమం అలరింపజేసింది.

– న్యూస్‌టుడే, ఎంజీఎం ఆసుపత్రి

నాణ్యతా ప్రమాణాలతో నియంత్రికల మరమ్మతు


మాట్లాడుతున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

బాలసముద్రం, న్యూస్‌టుడే: విద్యుత్తు నియంత్రికల మరమ్మతులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని, ఈ మేరకు తగిన జాగ్రత్తలు పాటించాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి అన్నారు. ఎస్పీఎం షెడ్ల నిర్వాహకులు, అందులో పని చేసే సిబ్బందికి హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్తు భవన్‌లో బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ.. నియంత్రికల వైఫల్యాలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి జిల్లాలో ఆదర్శవంతంగా ఎస్పీఎం షెడ్లు నెలకొల్పుతామని అన్నారు. ఈ నెల 29 వరకు శిక్షణ తరగతులు కొనసాగుతాయని చెప్పారు. కార్యక్రమంలో విద్యుత్తు భవన్ అధికారులు సదర్‌లాల్, మధుసూదన్, కేఎన్.గుట్ట, అన్నపూర్ణ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సర్దుబాటుతో సమస్య తీరేనా?

జిల్లాలో సర్కారు పాఠశాలలపై అధికారుల పర్యవేక్షణ కరవైంది. కొంతమంది ఉపాధ్యాయులు విద్యాశాఖ అధికారుల ఆదేశాలను సైతం విస్మరిస్తున్నారు. పైరవీలతో తమకు అనుకూలమైన చోట పని చేయడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. దీంతో ప్రాథమిక విద్య కుంటుపడుతోంది. విద్యార్థులు తక్కువగా ఉన్నచోట ఎక్కువ మంది ఉపాధ్యాయులు.. పిల్లలు ఎక్కువగా ఉన్నచోట తక్కువ మంది గురువులు ఉన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సర్దుబాటుకు శ్రీకారం చుట్టింది. ఇటీవల జిల్లా విద్యాశాఖ కొంతమంది ఉపాధ్యాయులను సర్దుబాటు చేసినా.. చాలామంది ఆయా పాఠశాలల్లో రిపోర్ట్ చేయలేదు. బదిలీల ప్రక్రియ పూర్తయినా.. పలువురు ఉపాధ్యాయులు ఇప్పటికీ రిలీవ్ కాలేని పరిస్థితి నెలకొంది. దీంతో ప్రభుత్వం నేరుగా సర్దుబాటు చేయడానికి తాత్కాలిక బదిలీలు చేయాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు.


– న్యూస్‌టుడే, వరంగల్ విద్యావిభాగం

పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తి ఇలా..

1-10	11-60	61-90	91-120	121-150	151-200
1	2	3	4	5	6

200 మంది పిల్లలు దాటితే ప్రతి 40 మందికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలి

విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి ఏడాది హేతుబద్ధీకరణ చేయాల్సి ఉంటుంది. విద్యార్థులు తక్కువగా ఉన్న బడుల నుంచి ఎక్కువగా ఉన్నచోటుకు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలి. పిల్లల నిష్పత్తి ఆధారంగా బదిలీలు చేస్తే తక్కువగా ఉన్నచోట ఖాళీ పోస్టు కనిపించక.. ఎక్కువగా ఉన్నచోటునే ఎంచుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2005 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం హేతుబద్ధీకరణ చేసింది. నాటి నుంచి నేటి వరకు విద్యాశాఖ ఆ వైపు దృష్టి సారించకపోవడంతో సమస్యలు ఏర్పడినట్లు కొంత మంది ఉపాధ్యాయులు తెలిపారు.


ఇటీవల 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమంలో..

విద్యార్థులు 18 మంది.. ఉపాధ్యాయులు ఏడుగురు..!

రాయపర్తి: రాయపర్తి మండలం కేశవాపూర్ ఉన్నత పాఠశాలలో 18 మంది విద్యార్థులు ఉండగా.. ఏడుగురు ఉపాధ్యాయులు విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రతిరోజూ సుమారు 10 నుంచి 15 మంది విద్యార్థులు మాత్రమే పాఠశాలకు హాజరవుతున్నారు. పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడి పోస్టు ఖాళీగా ఉండటం గమనార్హం.

పది మంది పిల్లలకు ఇద్దరు గురువులు


ద్వారకపేట పాఠశాల..

నర్సంపేట: నర్సంపేట పట్టణం ద్వారకాపేటలో ఉన్నది ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల అయినప్పటికీ విద్యార్థులు లేకపోవడంతో ప్రస్తుతం అయిదు తరగతుల వరకే నిర్వర్తిస్తున్నారు. మొత్తం 12 మంది విద్యార్థులకు సగటున 10 మంది హాజరవుతున్నారు. వీరికి ఇద్దరు ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. ప్రధానోపాధ్యాయురాలు వనిత రెగ్యులర్ కాగా.. నెల రోజుల కిందట ఇటుకాలపల్లి శివారు లైన్ తండా పాఠశాలలో పిల్లలు లేకపోవడంతో అక్కడ పనిచేసే ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌ను అధికారులు ఇక్కడికి డిప్యుటేషన్‌పై పంపించారు. ఈ పాఠశాలలో ఒకటో తరగతిలో విద్యార్థులెవరూ లేరు. రెండో తరగతిలో ముగ్గురు, మూడులో ఇద్దరు, నాలుగులో అయిదుగురు, అయిదో తరగతిలో ఇద్దరు చొప్పున ఉన్నారు. 'బడిబాట' కార్యక్రమంలో ప్రవేశాల కోసం ప్రయత్నించినా ఎవరూ చేరలేదని ప్రధానోపాధ్యాయురాలు వనిత తెలిపారు.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు..

- ఎం.జ్ఞానేశ్వర్, జిల్లా విద్యాశాఖ అధికారి

ప్రభుత్వం, కలెక్టర్ ఆదేశాల మేరకు తాత్కాలిక ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తాం. జిల్లాలో కొంతమందిని ఇటీవల సర్దుబాటు చేశాం. మరికొన్ని చోట్ల టీచర్ల కొరత ఉంది. ఇటీవల కొంతమంది ఉపాధ్యాయులు విధులకు గైర్హాజరైనట్లు గుర్తించి, చర్యలు తీసుకున్నాం. ఇటీవలే జిల్లా బాధ్యతలు చేపట్టాను. త్వరలో పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేపట్టి.. తప్పులు జరిగే చర్యలు తీసుకుంటాం.

మౌంట్ గోరీచెన్ పర్వతాన్ని అధిరోహించిన యశ్వంత్


జాతీయ పతాకంతో యశ్వంత్

మరిపెడ, న్యూస్‌టుడే: మహబూబాబాద్ జిల్లా మరిపెడకు చెందిన పర్వతారోహకుడు భూక్యా యశ్వంత్ ఇటీవల అరుణాచల్ ప్రదేశ్‌లోని మౌంట్ గోరీచెన్ పర్వతాన్ని అధిరోహించి మరో ఘనత సాధించారు. అతి పిన్న వయసులో ఈ ఘనత సాధించిన వ్యక్తిగా చరిత్ర సృష్టించారు. మరిపెడ మండలం భూక్యాతండాకు చెందిన యశ్వంత్ పట్టుదల, కృషి, ఆసక్తితో ప్రపంచంలోని శిఖరాలను అధిరోహిస్తున్నారు. సెప్టెంబర్ 4న ప్రారంభించిన యాత్ర 6488 మీటర్ల ఎత్తైన శిఖరాన్ని 18 రోజుల్లో అధిరోహించి కిందకు దిగినట్లు యశ్వంత్ పేర్కొన్నారు. ఎవరెస్ట్ అధిరోహించాలనే సంకల్పంతో ఒక్కొక్క అడుగు ముందుకు వేస్తున్నట్లు పేర్కొన్నారు. అసోం గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య యశ్వంత్‌కు అభినందనలు తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, సొంత అభిమానులు యశ్వంత్‌కు ఫోన్ ద్వారా అభినందనలు తెలిపారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి


ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రవీందర్, పీఆర్‌టీయూ నాయకులు

వరంగల్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యల సాధన కోసం పీఆర్‌టీయూ కృషి చేస్తుందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండలోని జడ్పీ సమావేశ మందిరంలో సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. వరంగల్ జిల్లా అధ్యక్షుడు రవీందర్ రెడ్డి అధ్యక్షత వహించారు. శ్రీపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సంఘం కృషితోనే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు జరిగాయని చెప్పారు. సీపీఎస్ రద్దు, ఓపీఎస్ పునరుద్ధరణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తామని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ మాట్లాడుతూ.. టీచర్ల సమస్యలు, పాత బకాయిలు చెల్లింపులపై సీఎంను కలుస్తామని అన్నారు. అనంతరం వరంగల్ జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఈదునూరి రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎండీ అబ్దుల్ గఫార్, అసోసియేట్ అధ్యక్షులుగా కె.రమ, ఎ.మహేందర్, ఉపాధ్యక్షులుగా పి.మల్లయ్య, ఎ.సుధాకర్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలిగా పి.అర్చితలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండు లక్ష్మణ్, మాజీ ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్, ప్రతిక సంపాదకులు ఇన్నారెడ్డి, ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, మండల బాధ్యులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు
(కిలో ఒక రూపాయలలో)
వెన్‌కాబ్

ఫాం:	125
రిటైల్:	147
డ్రెస్‌:	213
స్కిన్‌లెస్:	243

లక్ష్యం వైపు దూసుకెళ్తున్నారు!

ప్రతిభ గల పేద క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తే.. అద్భుతంగా రాణిస్తారనడానికి ఉదాహరణ ఇది.. సరైన నైపుణ్య శిక్షణ అందిస్తే చక్కటి ఫలితాలు వస్తాయనడానికి తార్కాణమిది.. 'ఈనాడు' సంస్థ తీసుకొచ్చిన 'లక్ష్య' కార్యక్రమం మారుమూల క్రీడాకారుల ప్రతిభను వెలుగులోకి తీసుకొస్తోంది.. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడకు చెందిన జీవాంజీ దీప్తి 'లక్ష్య' ప్రోత్సాహంతో పారిస్ పారాలింపిక్స్‌లో ఏకంగా కాంస్య పతకం కొల్లగొట్టింది. ఆమె స్ఫూర్తిగా హనుమకొండ కేంద్రంగా శిక్షణ తీసుకుంటున్న అథ్లెట్లు రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలతో దుమ్ములేపుతున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో పది పతకాలతో అదరగొట్టారు. ఈ నేపథ్యంలో వారిపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం..

–న్యూస్‌టుడే, వరంగల్ క్రీడావిభాగం


మహ్మద్ కైఫ్

చిరుత వేగంతో..

హుజురాబాద్‌కు చెందిన స్ప్రింటర్ మహ్మద్ కైఫ్ పరుగులో చిరుత వేగంతో పోటీపడతారు. చిన్నప్పటి నుంచి క్రీడలపై ఆసక్తి ఉండటంతో అథ్లెటిక్స్ ఎంచుకున్నారు. హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో 200 మీటర్ల పరుగులో స్వర్ణం, 100 మీటర్ల పరుగులో కాంస్య పతకాలతో ప్రతిభ కనబరిచారు. నాలుగు జాతీయ, ఆరు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న కైఫ్ స్ప్రింట్స్‌లో రికార్డు టైమింగ్ సృష్టిస్తానని చెబుతున్నారు.


సబ్బావత్ దత్తు

భారత జట్టులో చోటు కోసం..

నల్గొండకు చెందిన దత్తు నగరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ రెండో ఏడాది చదువుతున్నారు. లాంగ్‌జంప్, హెప్టాథ్లాన్‌లో తనదైన ప్రదర్శనతో పతకాలు సాధిస్తున్నారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో రెండు స్వర్ణాలు కైవసం చేసుకున్నారు. నిరుపేద రైతు కుటుంబానికి చెందిన దత్తుకు 'లక్ష్య' కేంద్రం అండగా ఉంటూ ఉచితంగా నైపుణ్య శిక్షణ అందిస్తోంది. ఇప్పటివరకు ఐదు జాతీయ స్థాయి, 14 రాష్ట్రా స్థాయి టోర్నీల్లో పాల్గొన్నారు. భారత అథ్లెటిక్స్ బృందంలో చోటు సంపాదిస్తానని అంటున్నారు.


రవితేజ

రెండు విభాగాల్లో..

మంచిర్యాలకు చెందిన రవితేజ 3000 మీటర్ల(ఫ్లాట్ రన్), 3000 మీటర్ల స్టిపుల్ చేస్‌లో అత్యంత ప్రతిభతో రాణించాడు. రాష్ట్ర స్థాయిలో జరిగిన పోటీల్లో రెండు విభాగాల్లో కాంస్య పతకాలు కొల్లగొట్టాడు. జాతీయ స్థాయిలో నాలుగు, రాష్ట్ర స్థాయిలో 9 టోర్నీల్లో పాల్గొన్నాడు. అండర్-20 3000 మీటర్ల స్టిపుల్ చేస్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించాలని లక్ష్యంగా సాధన కొనసాగిస్తున్నారు. హనుమకొండలోని కాకతీయ డిగ్రీ కళాశాలలో రెండో ఏడాది చదువుతున్నారు.


గణేష్

రికార్డు టైమింగ్ నమోదు

హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో గణేష్ రికార్డు టైమింగ్ నమోదు చేశారు. 100 మీటర్ల పరుగును 10.83 సెకండ్లలో పూర్తి చేశారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ టైమింగ్‌గా కోచ్ నాగరాజు తెలిపారు. నల్గొండకు చెందిన రవితేజ హనుమకొండలోని కేడీసీలో డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్నారు. రెండేళ్ల క్రితమే రవితేజ 'లక్ష్య'లో చేరారు. నైపుణ్య శిక్షణ అందడంతో పరుగుకు మరింత పదును పెంచారు. మెరుగైన ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయిలోను రికార్డు టైమింగ్ నమోదు చేస్తానని తెలిపారు.

హనుమకొండ జేఎన్ స్టేడియం కేంద్రం

2019లో హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం కేంద్రంగా ఈనాడు 'లక్ష్య' అథ్లెటిక్స్ శిక్షణ శిబిరం ప్రారంభమైంది. వరంగల్‌కు చెందిన భారత అథ్లెటిక్స్ జట్టు చీఫ్ కోచ్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేష్ సూచనతో జాతీయ స్థాయి అథ్లెట్ నాగరాజును కోచ్‌గా ఎంపిక చేశారు. కొద్ది మందితో ప్రారంభమైన శిక్షణ అంచెలంచెలుగా జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తాచాటే వరకు చేరారు. ప్రస్తుతం 18 బాలురు, ఒక బాలిక తర్ఫీదు పొందుతున్నారు. వారిలో 15 మంది జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. దత్తు, గణేష్ జాతీయ స్థాయిలో ఏకంగా పతకాలు కొల్లగొట్టారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో పది పతకాలు

దక్షిణ భారత పోటీలకు..

ఇటీవల హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయం క్రీడా మైదానంలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో వరంగల్ లక్ష్య అథ్లెట్లు ఏకంగా పది పతకాలు సొంతం చేసుకున్నారు. దత్తు, కైఫ్, గణేష్, శ్రీధర్, రాఘవ, రవితేజ, తరుణ్‌కుమార్ తమ విభాగాల్లో అద్భుత ప్రదర్శనతో పతకాలు సాధించారు. కైఫ్, గణేష్, శ్రీధర్, రవితేజ, దత్తులు గుంటూరులో అక్టోబర్ 19, 20న జరిగే దక్షిణ భారత అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారు. పోటీల్లో దత్తు, కైఫ్, రవితేజ రెండేసి పతకాలతో సత్తాచాటారు.


హనుమకొండ జేఎన్ స్టేడియంలో శిక్షణలో ఉన్న అథ్లెట్లతో లక్ష్య మెంటర్ నాగపురి రమేష్ (పాత చిత్రం)

ఆర్మీ ఉద్యోగాలకు ఎంపిక


లక్ష్య శిక్షణ శిబిరానికి చెందిన అథ్లెట్లు 2022, 2023 సంవత్సరాల్లో ఆర్మీ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వారిలో నిరోష్, ఆదిత్య కృష్ణ, రోహిత్, శ్రీను, ప్రవీణ్, అభినవ్, రఘునాథ్, సింగ్, నగేష్ శ్రావణ్‌లు ఉన్నారు. ప్రస్తుతం దేశంలోని వివిధ సైనిక శిబిరాల్లో శిక్షణలో ఉన్నారు.


జనగామ కలెక్టరేట్‌లో ప్రారంభించి భోజనం చేస్తున్న ఎంపీ కావ్య, కలెక్టర్ రిజ్వాన్‌బాషా, తదితరులు

మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభం

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) ఆధ్వర్యంలో జనగామ జిల్లా సచివాలయంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను పాలనాధికారి రిజ్వాన్ బాషాతో కలిసి వరంగల్ ఎంపీ కడియం కావ్య బుధవారం ప్రారంభించి, నిర్వహణ తీరును పరిశీలించారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో కలిసి భోజనం చేశారు. కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బంది ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మంచి నాణ్యతతో కూడిన ఆహార పదార్థాలను అందించాలని నిర్వాహకులకు ఎంపీ సూచించారు. అనంతరం బిల్లు చెల్లిస్తూ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ములుగు జిల్లా కలెక్టర్ పేరిట నకిలీ ఖాతా



ములుగు, న్యూస్‌టుడే: ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ పేరుతో సైబర్ నేరగాళ్లు నకిలీ ఫేస్‌బుక్ ఖాతా తెరిచి పలువురికి మెసేజ్‌లు పంపిస్తూ డబ్బులు అడుగుతున్నారు. ఈ విషయాన్ని గమనించిన కలెక్టర్ అప్రమత్తమై మోసపూరిత మెసేజ్‌లను నమ్మొద్దని, వెంటనే దానిని తొలగించాలని పేర్కొంటూ ఒక ప్రకటన విడుదల చేశారు. కలెక్టర్ పేరులో సమావేశంలో ఉన్నానని అత్యవసరంగా డబ్బులు కావాలని 998886747021 ఉజ్బెకిస్తాన్ నంబర్ నుంచి పలువురికి ఈ సందేశం పంపించి సైబర్ నేరగాడు డబ్బులు ఫోన్ పే చేసి స్క్రీన్ షాట్ షేర్ చేయాలని కోరాడు. దీంతో కలెక్టర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన ఫేస్‌బుక్ అకౌంట్ ద్వారా అందరిని అప్రమత్తం చేశారు. తన పేరుతో ఎవరైనా డబ్బులు అడిగితే ఇవ్వొద్దని సూచించారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

శిక్షణ ఎస్సైలకు ఠాణాల కేటాయింపు

వరంగల్‌క్రైం : పోలీసు శాఖలో ఎంపికై శిక్షణకు కమిషనరేట్‌కు వచ్చిన ఎస్సైలకు ఠాణాలు కేటాయించారు. రెండు ఠాణాల్లో 15 రోజుల చొప్పున విధులు నిర్వర్తించాలి. వివిధ అంశాలపై సీనియర్ అధికారులు అవగాహన కల్పిస్తారు. ఈ నెల 25 నుంచి అక్టోబర్ 9 వరకు, అక్టోబర్ 10 నుంచి 24 వరకు రెండు విడతల్లో శిక్షణ పొందుతారు.

ప్రతిభ చాటేందుకు.. యువజనోత్సవం


జానపద నృత్యం చేస్తున్న బృందం (పాత చిత్రం)

స్వామి వివేకానందుడి జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం యువజన సర్వీసుల ఆధ్వర్యంలో ఏటా యువజనోత్సవం నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా యువత ప్రతిభ చాటేందుకు అవకాశం కల్పిస్తోంది. రాష్ట్ర సంచాలకుడు, యువజన సర్వీసుల శాఖల ఆదేశాల మేరకు పాలనాధికారి అధ్యక్షతన జిల్లా యువజన, క్రీడల ఆధ్వర్యంలో ఈ నెల 28న యువజనోత్సవాలను నిర్వహించనున్నారు. జానపద నృత్యాలు, జానపద గేయాలు విభాగంలో వ్యక్తిగత, బృంద పోటీలు ఉంటాయి. కవిత్వం, వ్యాసరచన, పోస్టర్ రూపకల్పన, వక్తృత్వ పోటీలు ఉంటాయి. సైన్స్ మేళాను యువజనోత్సవాల్లో మొదటిసారి ప్రవేశపెట్టారు. సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాల్లో నైపుణ్యాన్ని వెలికితీయడమే లక్ష్యంగా ఈ పోటీలు ప్రవేశపెట్టారు. యువత సొంతంగా తయారు చేసిన ప్రాజెక్టులు, నమూనాలు ప్రదర్శించవచ్చు. యువకృతి విభాగంలో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన హస్తకళలను అర్థం చేసుకోడానికి యువజన క్రీడల శాఖ అవకాశం కల్పిస్తోంది. దీని కోసం హస్త కళలు, వస్త్రాలు, వ్యవసాయ ఉత్పత్తులు, తదితర అంశాలపై గరిష్ఠంగా ఇద్దరు వ్యక్తులు ముఖాముఖిలో పాల్గొనేందుకు అవకాశం ఉంది. యువజనోత్సవాలను యువతీ యువకులకు మూడు దశల్లో పోటీలు నిర్వహిస్తారు. మొదటి దశ జిల్లా స్థాయిలో ఈ నెల 28న, రెండో దశ హైదరాబాద్‌లో, మూడో దశ జనవరి 12-16 వరకు కర్ణాటకలో జాతీయ స్థాయి పోటీలు ఉంటాయి. 15 నుంచి 29 ఏళ్ల మధ్యనున్న యువత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ములుగు జిల్లా యువజన, క్రీడల అధికారి తుల రవి కోరారు.

–న్యూస్‌టుడే, ములుగు టౌన్

నైపుణ్య ప్రదర్శనకు.. కళా ఉత్సవ్


నృత్యం చేస్తున్న విద్యార్థిని(పాతచిత్రం)

విద్యార్థులు చదువుకే పరిమితం కాకుండా వివిధ దశల్లో ప్రతిభ చాటేందుకు ఎన్‌సీఈఆర్టీ, తెలంగాణ సమగ్ర శిక్షా అభియాన్ సంయుక్తంగా 'కళా ఉత్సవ్' పేరుతో పలు రకాల పోటీలు నిర్వహిస్తున్నాయి. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పోటీల నిర్వహణకు విద్యాశాఖ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. తొమ్మిది, పదో తరగతి, ఇంటర్ మొదటి, రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు అర్హులు. విద్యార్థులు ఏదైనా కళను ప్రదర్శించవచ్చు. దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సమాచారం ఇవ్వాలి. మండల, జిల్లా స్థాయి పోటీలు జిల్లా విద్యాధికారుల సూచనల మేరకు ఈ నెలాఖరు నాటికి నిర్వహిస్తారు. అక్టోబరులో రాష్ట్ర స్థాయి, నవంబరులో జాతీయ స్థాయిలో పోటీలు జరగనున్నాయి. జాతీయ స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన కళాకారులకు నగదు బహుమతులు, పథకాలు, ప్రశంసాపత్రాలు అందజేస్తారు. స్వర సంగీతం, వాయిద్య సంగీతం, నృత్యం, థియేటర్, దృశ్యకళ, సంప్రదాయక కథ చెప్పడం వంటి అంశాలపై ప్రధానంగా పోటీలు ఉంటాయి. ఉప అంశాలైన జానపద, క్లాసికల్ నృత్యాలు, సంగీతం, సంప్రదాయ చిత్రాలు, హిందుస్థానీ, కర్ణాటక, జానపదం, చిత్రలేఖనం, శిల్పకళ, కథలు చెప్పడం, నాటకంలో కళాకారులు తమ ప్రతిభ చూపవచ్చు. 'వివిధ కళల్లో విద్యార్థులు ప్రతిభ చాటేందుకు 'కళా ఉత్సవ్' ఓ మంచి వేదిక.. జిల్లా విద్యాధికారి సూచనల మేరకు ప్రతి పాఠశాల నుంచి విద్యార్థులు పాల్గొనేలా ప్రధానోపాధ్యాయులు చొరవ చూపాలని అకాడమిక్ క్వాలిటీ సమన్వయకర్త కె.లక్ష్మణ్ చెప్పారు.

– న్యూస్‌టుడే, భూపాలపల్లి, మానుకోట

పనులు వేగిరం.. దక్కిన ఫలితం

ఎన్‌హెచ్‌సీ పోటీల్లో ఓరుగల్లు సత్తా


దిల్లీలో స్మార్ట్‌సిటీ ఎండీ రాహుల్ కపూర్ నుంచి ధ్రువపత్రం అందుకుంటున్న గ్రేటర్ వరంగల్ ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, చిత్రంలో ఏఈ కార్తీక్‌రెడ్డి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: చారిత్రక ఓరుగల్లు మహా నగరానికి జాతీయస్థాయిలో గుర్తింపు లభించింది. మూడేళ్లుగా నిర్వహిస్తున్న నైబర్ హుడ్ ఛాలెంజ్(ఎన్‌హెచ్‌సీ) పోటీల్లో గ్రేటర్ వరంగల్ సత్తా చాటింది. బెంగళూరు, ఇండోర్, జబల్‌పూర్, కొచ్చితో పాటు వరంగల్ నగరానికి నైబర్ హుడ్ ఛాలెంజ్ పోటీల్లో 'ఎక్సలెన్స్ సర్టిఫికెట్' దక్కింది. బుధవారం దిల్లీలో కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణశాఖ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో స్మార్ట్‌సిటీ మిషన్ డైరెక్టర్ రాహుల్ కపూర్ చేతుల మీదుగా బల్దియా ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, ఏఈ కార్తీక్‌రెడ్డి ఎక్సలెన్స్ ధ్రువపత్రం అందుకున్నారు.

ఎందుకు వచ్చిందంటే..!

దేశ వ్యాప్తంగా ఎంపిక చేసిన 100 స్మార్ట్‌సిటీ నగరాలకు మూడేళ్ల క్రితం మొదటి దశలో నర్చరింగ్ నైబర్ హుడ్ ఛాలెంజ్ పేరుతో నిధులు కేటాయించారు. స్మార్ట్‌సిటీ మిషన్ జారీ చేసిన నిర్ణీత సమయంలో అధికారులు వరంగల్ దేశాయిపేట ఎంహెచ్‌నగర్‌లో 56 గంటల్లో చిట్టి పార్కు ఏర్పాటు చేశారు. ఇదే విధంగా క్రిస్టియన్ కాలనీ, కరీమాబాద్ గుండుబావి, హనుమకొండ శ్రీనగర్ కాలనీలో పార్కులు సిద్ధం చేశారు. హనుమకొండ అంబేడ్కర్ కూడలిలో బుద్ధ ప్లాజాను నిర్ణీత సమయంలో పూర్తి చేశారు. ఈ వివరాలన్నీ కేంద్ర పట్టణాభివృద్ధి శాఖకు పంపించారు. ఈ నేపథ్యంలో గుర్తింపు దక్కింది.

వరంగల్‌కు గర్వకారణం

- గుండు సుధారాణి, మేయర్

'నైబర్ హుడ్ ఛాలెంజ్' పోటీల్లో వరంగల్ నగరానికి ఎక్సలెన్స్ సర్టిఫికెట్ దక్కడం గర్వంగా ఉంది. ఈ స్ఫూర్తితో నగర సుందరీకరణ కొనసాగిస్తాం. రెండో దశ పోటీ కోసం కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ నిధులు ఇవ్వనుంది. వాటితో మరిన్ని పార్కులు అభివృద్ధి చేస్తాం.


పార్కు ముఖ ద్వారం పరిస్థితి ఇది


నిలిచిన వర్షం నీరు

సరిగమ.. నిర్వహణ మమ!

ఫోకస్


కూలిన స్తంభాలు


దొంగల పాలైన శిల్పాల ముందు లైట్లు

ఒకప్పుడు ఆ పార్కులోకి వెళ్తే సప్త స్వరాలు వింటున్న అనుభూతి కలిగేది. . శిల్ప సౌందర్యం, పచ్చని పరిసరాలు ఆహ్లాదంగా కనిపించేవి.. నేడు మాత్రం విరిగిన ముఖద్వారం తాలూకు శిల్పాలు, అక్కడక్కడా అందమైన శిల్పాలకు పెట్టిన లైట్లు దొంగలపాలయ్యాయి. నిర్వహణ లేక ఆ పార్కు ఇలా కనిపిస్తోంది. లక్షలు వెచ్చించి ఖర్చు చేసినా ఉపయోగం లేకుండా పోయింది. హనుమకొండలోని పద్మాక్షి రోడ్‌లోని సరిగమ పార్కు దుస్థితి ఇది. – ఈనాడు, హనుమకొండ

రాష్ట్రస్థాయి జూడో పోటీలు షురూ!

వరంగల్ క్రీడావిభాగం : రాష్ట్రస్థాయి జూడో పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్ఐ) రాష్ట్రస్థాయి పోటీలు పోచమ్మమైదాన్ సమీపంలోని కెమిస్ట్రీ భవన్‌లో జరిగాయి. ముఖ్య అతిథిగా ఒలింపిక్ సంఘం కార్యదర్శి కైలాస్‌యాదవ్ హాజరై పోటీలను ప్రారంభించారు. ఉమ్మడి పది జిల్లాలకు చెందిన క్రీడాకారులు హాజరయ్యారు. ఎస్‌జీఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి దస్రునాయక్ మాట్లాడుతూ.. సుమారు 200 మంది క్రీడాకారులు హాజరయ్యారన్నారు. క్రీడాకారులకు ఉచిత భోజన వసతి కల్పించినట్లు వివరించారు. ఈ నెల 27 వరకు పోటీలు జరుగుతాయన్నారు. వివిధ జిల్లాల కోచ్‌లు, ప్రభుత్వ పీఈటీలు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డు వేశారు..
తీగ తొలగింపు మరిచారు



గీసుకొండ(జాన్‌పాక), న్యూస్‌టుడే: జాన్‌పాక గ్రామంలోని పాఠశాల వద్ద గతేడాది కొత్తగా సిమెంట్ రోడ్డు వేశారు. అయితే అధికారులు రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్తు స్తంభానికి సపోర్టుగా వేసిన తీగను మార్చకపోవడంతో గ్రామస్థులు నిత్యం ఇబ్బందులుపడుతున్నారు. రోడ్డుకు అడ్డంగా ఉండడంతో కాలినడకన నాలుగు చక్రాల వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. వర్షాకాలంలో రోడ్డుకు అడ్డంగా ఉన్న తీగను తగిలి పలువురు విద్యుదాఘాతానికి గురయ్యారు. ఇది గమనించి ఎంపీ ఖలీల్ అనే వ్యక్తి విద్యుత్ తీగ చుట్టూ ప్లాస్టిక్ పైపు చుట్టారు. సంబంధిత అధికారులు స్పందించి తీగను రోడ్డు పక్కకు మార్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.

దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి

రంగశాయిపేట, న్యూస్‌టుడే: దేశ సేవే జీవిత పరమావధిగా ముందుకు సాగిన సామాజికవేత్త పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా బుధవారం 42వ డివిజన్ పరిధిలోని రంగశాయిపేటలో ఆయన చిత్రపటానికి జిల్లా భాజపా అధ్యక్షుడు గంటా రవికుమార్ పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.



రంగశాయిపేటలో.. నివాళులర్పిస్తున్న భాజపా నాయకులు

గీసుకొండ: భాజపా ఆధ్వర్యంలో బుధవారం గీసుకొండలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని నిర్వహించారు. రాష్ట్ర నేత పగడాల కాళీప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మరియపురం గ్రామంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు.

అందరి భాగస్వామ్యంతోనే స్వచ్ఛ గ్రామాలు

పర్వతగిరి, న్యూస్‌టుడే: ప్రజలందరి భాగస్వామ్యంతో గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుకోవాలని, తద్వారా ఉత్తమ అవార్డులు వస్తాయని జిల్లా పాలనాధికారి డా. సత్యశారద సూచించారు. 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమంలో భాగంగా మండలంలోని కల్లెడ గ్రామాన్ని బుధవారం ఆమె సందర్శించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన గ్రామం, తడి, పొడి చెత్త సేకరణ విధానం పటాలను పరిశీలించారు. ప్లాస్టిక్ నివారణకు ఏర్పాటు చేసిన స్టీల్ బ్యాంకును చూసి.. మొక్క నాటారు.



'స్వీయచిత్ర కేంద్రం' వద్ద పాలనాధికారి సత్యశారద, డీఆర్‌డీవో, మండల ప్రత్యేక అధికారులు

అనంతరం స్వీయచిత్ర కేంద్రం(సెల్ఫీ పాయింట్) వద్ద ఫొటో దిగారు. ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడానికి చేపట్టిన సంతకాల సేకరణలో పాలనాధికారి భాగస్వాములయ్యారు. అనంతరం స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాలనాధికారి మాట్లాడుతూ.. స్వచ్ఛతపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామ పంచాయతీ సిబ్బందిని సన్మానించి, కిట్లు అందజేశారు. అక్కడి నుంచి కల్లెడ గ్రామానికి వచ్చిన పాలనాధికారి.. పారా ఒలింపిక్స్ కాంస్య పతక విజేత దీప్తి తల్లి ధనలక్ష్మితో ఇంటి స్థలం విషయమై మాట్లాడారు. కోతుల బెడదతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు పాలనాధికారి దృష్టికి తీసుకురాగా.. నివారణకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అదనపు పాలనాధికారి సంధ్యారాణి, డీపీఓ రాంరెడ్డి, డీఆర్డీఓ కౌసల్యాదేవి, మండల ప్రత్యేక అధికారిణి నీరజ, సెర్ప్ ఏడీపీ రేణుకాదేవి, ఎంపీడీఓ శంకర్‌నాయక్, తహసీల్దార్ వెంకటస్వామి, ఎంపీఓ శ్రీనివాస్, ఏపీఓలు తదితరులు పాల్గొన్నారు.

■ మిషన్ భగీరథ పథకంలో గ్రామ మంచినీటి సహాయకులుగా పనిచేస్తున్న వారికి ఇస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పాలనాధికారి సత్యశారద సూచించారు. మండల పరిషత్ సమావేశపు మందిరంలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. భగీరథ ఎస్ఈ సురేందర్, జిల్లా అధికారులు, మంచినీటి సహాయకులు పాల్గొన్నారు.

పర్వతగిరి: మండలంలోని కల్లెడ ఊర చెరువుకు వెళ్లే ఎస్సారెస్పీ డీబీఎం 48 కెనాల్ కాలువను పూడ్చి.. ప్లాట్లు చేసి విక్రయించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం కల్లెడ గ్రామానికి వచ్చిన పాలనాధికారి సత్యశారదకి వినతిపత్రం అందజేశారు.

వరంగల్ కలెక్టరేట్: జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణకు కఠిన చర్యలు చేపట్టాలని జిల్లా పాలనాధికారి డా.సత్యశారద సంబంధిత అధికారులను ఆదేశించారు. మత్తు పదార్థాల నియంత్రణపై కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లా సరిహద్దుల్లోని అటవీ భూముల్లో గంజాయి సాగుపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. మత్తు పదార్థాలకు బానిసలైన వారిని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే 87126 61111 నంబరుకు సమాచారం అందించాలన్నారు. అదనపు పాలనాధికారి సంధ్యారాణి, డీసీపీ రవీందర్, మట్టెవాడ సీఐ గోపీ, డీఎంహెచ్ఓ డా.వెంకటరమణ, అధికారులు పాల్గొన్నారు.

మేమున్నాం... మీకు తోడుగా

99635 59929, 98484 09191, 99896 42307, 97053 46535 (10 AM TO 1 PM)

ఖిలావరంగల్, న్యూస్‌టుడే: చింతల్ 36వ డివిజన్ పరిధిలోని అలీనగర్‌లో పేరుకుపోయిన చెత్త కారణంగా దోమల బెడద ఎక్కువగా ఉంది.

- రాజేష్‌ఖన్నా, స్థానికులు

■ రెండు రోజుల్లో శుభ్రం చేయిస్తాం.

- రవిరాజ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్

సర్వాపురం నీళ్ల ట్యాంకు శుభ్రం



ఈనాడు కథనానికి స్పందన

నర్సంపేట, న్యూస్‌టుడే: నర్సంపేట పురపాలికలో విలీన గ్రామం సర్వాపురంలోని నీళ్ల ట్యాంకును పురపాలక సిబ్బంది శుభ్రం చేశారు. ఈ నెల 20న 'శుద్ధం.. అబద్ధం' శీర్షికన 'ఈనాడు' దినపత్రికలో తాగు నీరు కలుషితమై ప్రజలు పడుతున్న ఇబ్బందులను వెలుగులోకి తెచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పురపాలక ఏఈ రాజేశ్ మంచినీటి విభాగానికి చెందిన నలుగురు కార్మికులను పంపి సర్వాపురంలోని నీళ్ల ట్యాంకు లోపల పేరుకుపోయిన బురద మట్టిని ఎత్తి బయట పోయించి శుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. పట్టణంలోని మిగిలిన నీళ్ల ట్యాంకులను శుభ్రం చేయిస్తానని ఏఈ వివరించారు.

వాహనాల మరమ్మతుల్లో జాప్యం చేయొద్దు



వెహికిల్ డిపో రోడ్డు చూస్తున్న మేయర్ సుధారాణి, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: చెత్తను తరలించే వాహనాలకు అత్యవసరంగా మరమ్మతులు చేయాలి, రోజుల తరబడి షెడ్డులో ఉంచితే ఎలా? అని బల్దియా ఇంజినీర్లను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ప్రశ్నించారు. బుధవారం మేయర్ గుండు సుధారాణితో కలిసి హనుమకొండ బాలసముద్రం వెహికిల్ డిపోను తనిఖీ చేశారు. వాహనాల మరమ్మతులు ఆలస్యం అవుతున్నాయని కార్పొరేటర్లు చెప్పడంతో పరిశీలించారు. ఎన్ని వాహనాలు ఉన్నాయి?, ఎన్ని రోజులుగా బాగు చేయడం లేదో రిజిస్టర్ చూశారు. కొందరు చోదకులు, మెకానిక్‌లు, సిబ్బంది విధులకు రాకపోవడంపై ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. చెత్తను తరలించే క్రమంలో బాలసముద్రం కాలనీవాసులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. కొత్తగా సీసీ రోడ్డు వేయాలని ఇంజినీర్లకు సూచించారు. వరంగల్ పోతననగర్ ఆధునిక చెత్త రవాణా కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

వ్యాధుల కాలం.. జర భద్రం



సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: ప్రస్తుతం కాలానుగుణ వ్యాధులు నమోదు అవుతున్నందున ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ.. ఇంటింటా జ్వర సర్వే చేపట్టాలని డీఎంహెచ్ఓ డా.వెంకటరమణ ఆదేశించారు. వరంగల్ నగరంలోని ఎల్బీనగర్ ప్రాంతంలో నమోదైన డెంగీ వ్యాధిగ్రస్థుడి ఇంటిని బుధవారం క్షేత్రస్థాయిలో సందర్శించారు. బాధితుడిని పరామర్శించి, ఆరోగ్య సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించి, మున్సిపల్ సిబ్బంది చేపడుతున్న వ్యాధి నివారణ చర్యలను పరిశీలించారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేయాలని సిబ్బందికి సూచించారు. సాయంత్రం వేళ ఫాగింగ్ చేపట్టాలన్నారు. ప్రజలు సైతం స్వీయ రక్షణ చర్యలు పాటించాలన్నారు. ఆయన వెంట బల్దియా బయాలజిస్టు మాధవరెడ్డి, జిల్లా ఇన్‌ఛార్జి మలేరియా అధికారి మాడిశెట్టి శ్రీనివాస్, ఎస్‌యూఓ విజయేంద్రకుమార్, సూపర్‌వైజర్లు సదానందం, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

పోచమ్మమైదాన్, న్యూస్‌టుడే: నగరంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ నందిరాం నాయక్ హెచ్చరించారు. బుధవారం వరంగల్ బస్టాండ్, రైల్వేస్టేషన్, గిర్మాజీపేట, లక్ష్మీపురంలో డీసీపీ షేక్ సలీమా ఆధ్వర్యంలో నిర్బంధ తనిఖీలు(కార్డెన్ సెర్చ్) నిర్వహించారు. రూ.900 గుట్కాలు, రూ.10 వేల విలువ చేసే మద్యం సీసాలు, ధ్రువపత్రాలు లేని 10 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్న రమేశ్‌పై కేసు నమోదు చేశారు. సీఐలు మచ్చ శివకుమార్, గోపీరెడ్డి, ఎస్సైలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

బల్దియా ఎదుట కార్మికుల ధర్నా



రంగంపేట, న్యూస్‌టుడే: వరంగల్ మహా నగరపాలక సంస్థ ఒప్పంద ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ధర్నా చేశారు. తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో బల్దియా ప్రధాన కార్యాలయం ముందు నిరసన తెలిపారు. కార్మిక సంఘం నాయకులు సింగారపు బాబు, జన్ను ప్రకాశ్, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులను శిక్షించాలని నిరసన



కాశీబుగ్గ అంబేడ్కర్ కూడలిలో..

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: తిరుమల తిరుపతి దేవస్థానంలో లడ్డూ కల్తీకి కారణమైన వారిని శిక్షించాలని డిమాండ్ చేస్తూ.. సనాతన ధర్మ ద్రోహుల దిష్టిబొమ్మను రాష్ట్రీయ హిందూ పరిషత్(ఆర్‌హెచ్‌పీ) ప్రతినిధులు బుధవారం దహనం చేశారు. మొదట ఆర్‌హెచ్‌పీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు మడిపల్లి నాగరాజుగౌడ్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ కూడలిలో నిరసన తెలిపారు. నాయకులు మండల భూపాల్, ఆకుల సంతోష్, కోమాకుల నాగరాజు, పత్రి సుభాష్, చిమ్మని శ్రీకాంత్, సూరం రాజేందర్‌రెడ్డి, బండి సుజాత తదితరులు పాల్గొన్నారు.

రేపు 'మోషన్ టాలెంట్ టెస్ట్'



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఛైర్మన్ వేణుగోపాల్‌గౌడ్, అధ్యాపకులు

నయీంనగర్, న్యూస్‌టుడే: హనుమకొండ నయీంనగర్‌లోని మోషన్ ఐఐటీ, నీట్ శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం టాలెంట్ సెర్చ్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఛైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ తెలిపారు. బుధవారం శిక్షణ కేంద్రంలో పరీక్షకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని చెప్పారు. దేశ వ్యాప్తంగా జరిగే ఈ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉపకార వేతనాలు, 500 మంది విద్యార్థులకు ఉచిత విద్యను అందించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 97030 00850 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్ పెరుమాండ్ల అనిల్‌గౌడ్, బ్రాంచి హెడ్ సురేష్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ఏబీ బర్ధన్ శత జయంతి



పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

శివనగర్, న్యూస్‌టుడే: కమ్యూనిస్టు నేత ఏబీ బర్ధన్ శత జయంతిని బుధవారం శివనగర్‌లోని సీపీఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పనాస ప్రసాద్ ఏబీ బర్ధన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గుండె బద్రి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ల్యాదల్ల శరత్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ యాకూబ్, నామోజు వెంకటాద్రి, రాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రేటర్ ఉద్యోగుల ఐకాస కమిటీ ఎన్నిక

కార్పొరేషన్, న్యూస్‌టుడే: వరంగల్ మహా నగరపాలక సంస్థ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ కమిటీ నూతన కమిటీని బుధవారం సాయంత్రం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా బిర్రు శ్రీనివాస్, సలహాదారులుగా బొట్ల భిక్షపతి, ధర్మరాజు, అధ్యక్షుడిగా బొట్ల రమేశ్, ప్రధాన కార్యదర్శిగా బాకం సంతోష్, కోశాధికారిగా కట్కూరి స్వర్జన్ రాజు, కార్యదర్శిగా బాలునాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

రాజయ్యకు ఎస్ఈగా పదోన్నతి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: గ్రేటర్ వరంగల్ ఇంజినీరింగ్ విభాగం ఈఈ, ఇన్‌ఛార్జి ఎస్ఈగా ఉన్న రాజయ్యకు ఎస్ఈగా పదోన్నతి కల్పిస్తూ బుధవారం సాయంత్రం రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి దాన కిశోర్ జీఓ నంబరు 149 జారీ చేశారు. ఇక నుంచి రాజయ్య పూర్తిస్థాయి ఎస్ఈగా వ్యవహరిస్తారు.

వేతన బకాయిలు చెల్లించాలని వినతి

రాయపర్తి, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీ మల్టీ పర్పస్ కార్మికుల వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య కోరారు. కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి కార్మికులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కిషన్‌నాయక్‌కు వినతిపత్రం అందించారు.

సీఐపై సీపీకి ఫిర్యాదు

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: ఎల్బీనగర్‌లో ఇటీవల జరిగిన కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఇంతేజార్‌గంజ్ సీఐ మచ్చ శివకుమార్ తనను అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపిస్తూ.. సీపీ అంబర్ కిశోర్ ఝాకు బుధవారం ఫిర్యాదు చేసినట్లు కాశీబుగ్గ 21వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్ముల సందీప్ తెలిపారు. హనుమకొండలో సీపీ కార్యాలయానికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లి రాత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు వివరించారు.

'మంచినీళ్ల చెరువు' పరిరక్షణకు కమిటీ ఏర్పాటు



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న స్థానికులు

రాయపర్తి, న్యూస్‌టుడే: మండల కేంద్రం శివారులోని మంచినీళ్ల చెరువులో కోళ్ల పరిశ్రమ వ్యర్థాలు కలుస్తుండటంతో.. నీరు పూర్తిగా కలుషితమై రైతులు, గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యను పరిష్కరించుకునేందుకు గ్రామ యువత, వివిధ పార్టీల నాయకులతో చెరువు పరిరక్షణ కమిటీని బుధవారం ఏర్పాటు చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టి ఎమ్మార్వో శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. అంతకుముందు ఎస్సారెస్పీ డీఈ కిరణ్‌కుమార్ కోళ్ల పరిశ్రమ పరిసరాలను పరిశీలించారు.

నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించండి

రంగశాయిపేట, న్యూస్‌టుడే: విద్యార్థులు అధునాతన ఆవిష్కరణలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ఎంఎస్ఎంఈ టూల్ రూమ్(సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్) హైదరాబాద్ డిప్యూటీ డైరెక్టర్ జీ.సనత్‌కుమార్ తెలిపారు. వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల, వరంగల్ ఇండస్ట్రీ ఇన్‌స్టిట్యూట్ ఇంటరాక్షన్ సెల్(ఐఐఐసీ) ఆధ్వర్యంలో వివిధ అంశాలపై నిర్వహించిన సెమినార్‌కు ఆయన హాజరై మాట్లాడారు. ఇంజినీరింగ్ విద్యార్థులు మారుతున్న కాలానికి అనుగుణంగా తమ నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు. ప్రిన్సిపల్ ప్రకాశ్, వైస్ ప్రిన్సిపల్ తిరుపతిరావు, డీన్‌లు రాజు, శశిధర్, హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

సమాధుల కూల్చివేత సమంజసమేనా?

కార్పొరేషన్, న్యూస్‌టుడే: అభివృద్ధి పనుల పేరుతో పాతబస్తీలోని కరీమాబాద్ సాకరాశికుంట హిందూ శ్మశానవాటికలో సమాధులు కూల్చడం ఎంత వరకు సమంజసం అని భాజపా వరంగల్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్, రాష్ట్ర నాయకుడు కుసుమ సతీష్ ప్రశ్నించారు. బుధవారం సాయంత్రం శ్మశానవాటిక పరిరక్షణ కమిటీ ప్రతినిధులతో కలిసి గ్రేటర్ వరంగల్ కమిషనర్ డా.అశ్విని తానాజీని కలిసి వినతిపత్రం ఇచ్చారు. దీనిపై విచారణ జరిపించి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

చిన్నారులను పనిలో పెట్టుకుంటే చర్యలు

రాయపర్తి, న్యూస్‌టుడే: బాల బాలికలను పనిలో పెట్టుకుంటే యజమానులతో పాటు తల్లిదండ్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా బాలల పరిరక్షణ అధికారి దొమ్మటి రాజు పేర్కొన్నారు. మండల కేంద్రం శివారులోని శ్రీ సత్యనారాయణ స్వామి కోళ్ల పరిశ్రమను బుధవారం ఆయన సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. పని ప్రదేశంలో సుమారు 30 మంది చిన్నారులు ఉన్నట్లు గుర్తించి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. బాలబాలికలతో పాటు వారి తల్లిదండ్రులు గురువారం రాష్ట్ర శిశు సంక్షేమ కమిటీ ఎదుట హాజరుకావాలని ఆదేశించారు.

చెక్‌డ్యామ్ మరమ్మతు పనుల పరిశీలన



పనుల గురించి స్థానిక నేతలకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

వర్ధన్నపేట, న్యూస్‌టుడే: ఇల్లంద, వర్ధన్నపేట గ్రామాల మధ్య ఉన్న ఆకేరు వాగు చెక్‌డ్యామ్‌కు మరమ్మతులు చేసి నీరు నిల్వ ఉండేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పేర్కొన్నారు. చెక్‌డ్యామ్ కోతకు గురైన ప్రాంతాన్ని బుధవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ నేతలతో కలిసి పరిశీలించారు. తాత్కాలిక పనులు జరుగుతున్న తీరును.. చేయాల్సిన పనులను అడిగి తెలుసుకున్నారు. దిగువకు నీరు వృథాగా పోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు సారంగపాణి, నేతలు సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, అన్వర్, సుధీర్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆసుపత్రుల దోపిడీని నియంత్రించాలి

నర్సంపేట, న్యూస్‌టుడే: వైద్యం పేరుతో పట్టణంలోని కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు రుసుం పేరుతో చేస్తున్న దోపిడీని తక్షణమే అరికట్టాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి శ్రీధర్ డిమాండ్ చేశారు. నర్సంపేటలో బుధవారం జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న ప్రైవేటు ఆసుపత్రులపై చర్యలు చేపట్టి సీజ్ చేయాలన్నారు. వైద్యాధికారులు ప్రైవేటు ఆసుపత్రులకు అనుకూలంగా వ్యవహరిస్తుండటంతో నిర్వాహకులు దందా కొనసాగిస్తున్నారన్నారు. సమావేశంలో పార్టీ బాధ్యులు బాలకృష్ణ, రాజు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల హామీలను నెరవేర్చాలి



సమావేశంలో తెజస రాష్ట్ర నేత శ్రీనివాస్, నాయకులు

నర్సంపేట, న్యూస్‌టుడే: రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని తెజస రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఉమ్మడి జిల్లా ఇన్‌ఛార్జి అంబటి శ్రీనివాస్ అన్నారు. బుధవారం నర్సంపేటలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్టోబరులో నర్సంపేట, హనుమకొండలో తమ పార్టీ ఉద్యమకారులతో సదస్సులు జరుపుతామని పేర్కొన్నారు. నేతలు రాంచందర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేట : రాష్ట్ర సాధన కోసం కృషి చేసిన తెలంగాణ ఉద్యమకారులకు రెండు పడక గదుల ఇళ్లు నిర్మించాలని ఉద్యమకారుల ఐక్య వేదిక, ఉద్యమకారుల హక్కుల పోరాట సమితి బాధ్యులు డిమాండ్ చేశారు. సంఘాల బాధ్యులు రమాదేవి, నర్సయ్య, కుమారస్వామి, తిరుపతిరెడ్డి వెంకట్ ఆధ్వర్యంలో వివిధ గ్రామాలకు చెందిన ఉద్యమకారులు బుధవారం స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించి ఆర్డీవో కృష్ణవేణికి వినతిపత్రాన్ని అందించారు.

రైతు భరోసా తక్షణమే అమలుచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్

నర్సంపేట, న్యూస్‌టుడే: పెట్టుబడి కోసం పదెకరాల్లోపు సాగుచేసే అన్నదాతలకు రైతు భరోసా సత్వరమే అమలు చేసి బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని అఖిల భారత రైతు సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.రమేశ్ డిమాండ్ చేశారు. నర్సంపేటలోని ఓంకార్ భవన్‌లో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం నాయకులు మట్టయ్య, ఉపేందర్‌రెడ్డి, చంద్రయ్య, ఇస్మాయిల్, కిషన్, మల్లికార్జున్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

నర్సంపేట నియోజకవర్గం

సమతుల ఆహారంతోనే ఆరోగ్యం



కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు, అధ్యాపకులు

నర్సంపేట, న్యూస్‌టుడే: సమతుల ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నవీన్ అన్నారు. పోషణ మాసోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో డిగ్రీ కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీడీపీవో మధురిమ, కృషి విజ్ఞాన కేంద్రం అధికారి అరుణ్‌జ్యోతి, బానోజిపేట పీహెచ్‌సీ వైద్యుడు అరుణ్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలకు పార్థివ దేహం అప్పగింత

నర్సంపేట, న్యూస్‌టుడే: వైద్య విద్యార్థుల కోసం వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన కోన్‌రెడ్డి అయిల్‌రెడ్డి (85) పార్థివ దేహాన్ని ఆయన కుమారుడు రామ్మోహన్‌రెడ్డి, భార్య ఉపేంద్ర, కుటుంబ సభ్యులు బుధవారం పాకాల (నర్సంపేట) ప్రభుత్వ వైద్య కళాశాలకు అందజేశారు. తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక అంబులెన్స్‌లో పార్థివదేహాన్ని తీసుకువచ్చి ప్రిన్సిపల్ డా.మోహన్‌దాస్, ప్రేమ్ కుమార్‌కు అప్పగించారు. సంఘం ఉపాధ్యక్షులు ఉపేందర్‌రెడ్డి, రాజమౌళి, ప్రధాన కార్యదర్శి శంకర్‌రావు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పనులు గుర్తించి, ప్రణాళికలు రూపొందించండి

దుగ్గొండి, న్యూస్‌టుడే: ఉపాధిహామీ పథకంలో భాగంగా వచ్చే ఏడాది చేపట్టబోయే పనులను గుర్తించి, గాంధీ జయంతి నాటి గ్రామసభలో తీర్మానాలు చేయాలని జిల్లా ఉద్యానవన అధికారి, మండల పరిషత్తు ప్రత్యేక అధికారి సంగీత లక్ష్మి సూచించారు. 2024-25కు ప్రణాళికలు రూపొందించాలన్నారు. దుగ్గొండి మండల పరిషత్తు కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో బుధవారం ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో మండల ప్రత్యేకాధికారి సంగీత లక్ష్మి పాల్గొని మాట్లాడారు. ఎంపీడీవో అరుంధతి, మండల వ్యవసాయ అధికారి మాధవి, ఎంపీవో శ్రీధర్‌గౌడ్, ఏపీవో శ్రీనివాస్, ఈసీ రాజు, టీఏలు పాల్గొన్నారు.

'సర్దుబాటు ఆదేశాలు అసంబద్ధం'

దుగ్గొండి, న్యూస్‌టుడే: పాఠశాలల మూసివేతకు దోహదపడే ఉపాధ్యాయుల సర్దుబాటు ఆదేశాలను ఉపసంహరించుకోవాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి బోగేశ్వర్ డిమాండ్ చేశారు. టీపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మండలంలోని తొగర్రాయి, మహమ్మదాపురం, చలపర్తి, మల్లంపల్లి తిమ్మంపేట, మద్రిపల్లిలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఉపాధ్యాయుల సర్దుబాటు ఆదేశాలు అసంబద్ధంగా ఉన్నాయన్నారు. టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, జిల్లా నాయకుడు ఈదుల వీరస్వామి, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

కోచ్ శ్రీధర్‌కు వేతన కష్టాలు..!

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ కోచ్ శ్రీధర్‌కు ఇబ్బందులు తప్పడం లేదు. నాలుగు నెలలుగా జీతం ఇవ్వకుండా సంబంధిత అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు తెలిసింది. కార్పొరేషన్‌కు చెందిన ఓ అధికారి కోచ్ శ్రీధర్‌ను పిలిచి వరంగల్ జిల్లాలోని ఓ ప్రజాప్రతినిధి కలవాలని ఆదేశించినట్లు విశ్వసనీయ సమాచారం. లేకపోతే మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో కోచింగ్ ఇవ్వడం కుదరని హెచ్చరించడం నగరంలో తీవ్ర చర్చకు దారితీసింది. శ్రీధర్ కార్పొరేషన్‌కు చెందిన ఇండోర్ స్టేడియంలో సుదీర్ఘకాలంగా కోచ్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన పర్యవేక్షణలో శిక్షణ పొందుతున్న బ్యాడ్మింటన్ క్రీడాకారులు రాష్ట్ర, జాతీయస్థాయిలో పతకాలు సాధించారు. ఇటీవల నగరానికి చెందిన శ్రీచేతన్‌శౌర్య కోల్‌కత్తాలో జరిగిన జాతీయస్థాయిలో పోటీల్లో కాంస్య పతకం సాధించడం గమనార్హం. ఒలింపియన్ పీవీ సింధు సబ్ జూనియర్‌గా ఆడుతున్న సమయంలో శ్రీధర్ కోచ్‌గా వ్యవహరించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో శిక్షణలో ఉన్న వరంగల్‌కు చెందిన జాతీయస్థాయి క్రీడాకారులు ఒకప్పుడు శ్రీధర్ వద్ద మెలకువలు నేర్చుకున్నవారే. క్రీడలకు సంబంధం లేని అధికారిని ఇండోర్ స్టేడియంలో స్పోర్ట్స్ ఆఫీసర్‌గా నియమించడంతో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని క్రీడా సంఘాల నాయకులు ఆరోపించారు. కోచ్‌కు జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేయడంపై వారు మండిపడుతున్నారు.

పొలమారడంతో యువకుడి మృతి



రాహుల్ (పాతచిత్రం)

ఖిలావరంగల్, న్యూస్‌టుడే: నీళ్లు తాగేటప్పుడు పొలమారడం (స్వరంతప్పి)తో ఓ యువకుడు మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన బుధవారం వరంగల్ జిల్లాలో చోటుచేసుకుంది. ఎస్సై సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఫోర్ట్‌రోడ్ ప్రాంతానికి చెందిన శీలం రాహుల్(27) ఎనుమాముల మార్కెట్‌లో పనిచేస్తుంటాడు. బుధవారం ఇంట్లో టీ తాగడానికి ముందు నీళ్లు తాగే క్రమంలో పొలమారింది. విపరీతంగా దగ్గు రావడంతో ఊపిరి ఆడలేదు. భయాందోళనకు గురైన కుటుంబ సభ్యులు స్థానికులను పిలవగా.. సీపీఆర్ చేసి మెరుగైన చికిత్స కోసం 108లో ఎంజీఎం తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి తండ్రి బాబురావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు మిల్స్‌కాలనీ ఎస్సై సురేశ్ తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

పర్వతగిరి, న్యూస్‌టుడే: అప్పుల బాధతో పురుగుమందు తాగిన రైతు.. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన మండలంలోని అనంతారం గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం.. అనంతారం గ్రామానికి చెందిన బేతి మహేందర్(45) మూడు ఎకరాల్లో వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. గతంలో కుమార్తె వివాహానికి చేసిన అప్పులు, కుటుంబ పోషణ నిమిత్తం, వ్యవసాయం కోసం తెచ్చిన రుణం రోజురోజుకు పెరుగుతూ.. రూ.11 లక్షలు అయ్యింది. అప్పులు తీర్చే మార్గం కనిపించకపోవడంతో ఈ నెల 18న వ్యవసాయ పొలం వద్ద పురుగుమందు తాగాడు. స్థానిక రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మహేందర్ భార్య శారద, ఆయన కుమారుడు సతీశ్‌లు హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు మహేందర్ భార్య శారద పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పురుగుల మందు తాగి బలవన్మరణం



వెంకట్‌రెడ్డి (పాతచిత్రం)

నెక్కొండ, న్యూస్‌టుడే: పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన నెక్కొండలో చోటు చేసుకుంది. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన చల్లా వెంకట్‌రెడ్డి (48) వ్యవసాయం చేసుకుంటూ జీవన సాగిస్తున్నారు. కొన్ని సంవత్సరాలుగా మద్యానికి బానిసయ్యారు. మంగళవారం ఉదయం మద్యంతాగి ఇంటికి రాగా భార్య మందలించింది. దీంతో మనస్తాపానికి గురై మధ్యాహ్నం పురుగుమందు తాగాడు. కుటుంబ సభ్యులు నర్సంపేట ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడికి భార్య లలిత, కుమార్తె శ్రుతి, కుమారుడు సాయిచంద్‌రెడ్డి ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

గంజాయి పట్టివేత.. ఇద్దరు మహిళల అరెస్టు

కమలాపూర్, న్యూస్‌టుడే: మండలంలోని ఉప్పల్‌లో బుధవారం పోలీసులు ఇద్దరు మహిళలను నుంచి రెండు కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సీఐ హరికృష్ణ తెలిపిన వివరాల మేరకు.. పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా.. నర్సంపేటకు చెందిన మంతోజు స్వరూప, ఉప్పల్ గ్రామానికి చెందిన ఎండీ.షమీమ్ అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. వారి నుంచి ఎండు గంజాయి, రూ.17,900 నగదు, మూడు చరవాణులను స్వాధీనం చేసుకున్నారు.

వాహనదారులకు జరిమానా

మట్టెవాడ, న్యూస్‌టుడే: మద్యంతాగి వాహనాలు నడిపిన 29 మందికి బుధవారం రెండో తరగతి న్యాయమూర్తి వీరస్వామి రూ.48,200 జరిమానా విధించారు. చోదక అనుమతి లేకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న 9 మందికి రూ.8,500 జరిమానా విధించారన్నారు.